భయంతో ఉన్నవాళ్లు ఏదీ సాధించలేరు
- రవీంద్రనాథ్ ఠాగూర్

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

ఆదివారం, 18 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 03 | సంచిక 67


## కాజిపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

- సెలవులను అడ్డుపెట్టుకొని ఆక్రమణలు..
అధికారుల ఉక్కుపాదం!







**జిన్నారం, జనవరి : 17(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని జిన్నారం మండలం కాజిపల్లిలో ప్రభుత్వ భూములే లక్ష్యంగా సాగుతున్న అక్రమ కట్టడాలపై అధికారులు మళ్లీ విరుచుకుపడ్డారు. కాజిపల్లిలోని సర్వే నంబర్ 181 లో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన అక్రమ నిర్మాణాలు, బేస్‌మెంట్లను కట్టి ఉన్న రూమ్స్ , రెవెన్యూ, మున్సిపల్ మరియు పోలీస్ అధికారులు సమన్వయంతో శనివారం నేలమట్టం చేశారు. సంక్రాంతి పండుగ సెలవులను ఆసరాగా చేసుకుని, అధికారుల నిఘా ఉండదని భావించిన కొందరు ఆక్రమణదారులు రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించారు. గతంలో కూడా ఇదే సర్వే నంబర్‌లో కూల్చివేతలు జరిగినప్పటికీ, ఆక్రమణదారులు మొండిగా వ్యవహరిస్తూ మళ్లీ కట్టడాలు చేపట్టడం గమనార్హం. ప్రభుత్వం భూమిని కాపాడాలనే పట్టుదలతో అధికారులు భారీ బందోబస్తు మధ్య రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను జెసిబిలతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. "గతంలో కూల్చివేసినా మళ్లీ నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరం. సంక్రాంతి సెలవులను అడ్డుపెట్టుకొని అక్రమ కట్టడాలకు పూనుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమిలో వెలిసిన ప్రతి అడుగును స్వాధీనం చేసుకుంటామని అధికారులు తేల్చి చెప్పారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు భారీగా పాల్గొన్నారు..

## శెట్టికుంట శిఖం భూముల్లో అక్రమ కట్టడాల కూల్చివేత





**అమీన్‌పూర్, జనవరి : 17 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా అధికారులు శనివారం ముమ్మరంగా కూల్చివేతలు చేపట్టారు. ముఖ్యంగా శెట్టికుంట చెరువు శిఖం (ఎఫ్.టి.ఎల్) పరిధిలోని 947 సర్వే నంబర్లు, 993 ప్రభుత్వ స్థలాలు,లో వెలసిన అక్రమ



నిర్మాణాలపై రెవెన్యూ మరియు జిహెచ్‌ఎంసి అధికారులు ఉక్కుపాదం మోపారు. చాలా కాలంగా ఈ సర్వే నంబర్లలోని ప్రభుత్వ మరియు చెరువు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన అధికారులు, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రెండు భారీ బేస్‌మెంట్లు (పునాదులు) మరియు ఒక ప్రహరీ గోడను జెసిబిల సహాయంతో తొలగించారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా, శిఖం భూములను ఆక్రమించి చేసిన ఈ కట్టడాలను అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని లేదా చెరువు నిబంధనలను అతిక్రమించి ఎవరు నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా సర్వే నంబర్లు 993, 947 పరిధిలో సామాన్య ప్రజలు భూములు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అవి ఎఫ్.టి.ఎల్ లేదా ప్రభుత్వ భూములా అనేది సరిచూసుకోవాలని సూచించారు. ఆక్రమణల పట్ల రాజీపడే ప్రసక్తే లేదని, భవిష్యత్తులో కూడా ఇటువంటి చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు..

## జిల్లాల రద్దు కుట్రపై ఉద్యమ కార్యాచరణ చేపట్టాలి





**హైదరాబాద్** : ప్రజలకు పరిపాలన ఫలాలు అందకుండా జిల్లాల పునర్విభజన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిల్లాల రద్దుపై చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ( పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. పాలమూరు, నల్గొండ జిల్లాలకు సంబంధించిన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల్లో జరుగుతున్న ఆలస్యం, కృష్ణా జలాల వాటా వంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. పాలమూరు జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడి ప్రజలకు ప్రభుత్వం యొక్క సేవలు, అభివృద్ధి అందాల్సిన అవసరాలను వివరించాలన్నారు. కేసీఆర్ పరిపాలన, వికేంద్రీకరణ అనే దృక్పథంతో పాలమూరును అనేక జిల్లాలుగా మార్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. పాలమూరు జిల్లా బిడ్డను అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ఆ ఉమ్మడి జిల్లాపై కుట్రతో జిల్లాలను రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు అంశాలపై ఎక్కడికక్కడ ప్రజలను సమీకరించే విధంగా చైతన్యపరిచేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ వారీగా ప్రత్యేక కార్యాచరణ..మరోవైపు రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రతి మున్సిపాలిటీ వారీగా ప్రత్యేక కార్యాచరణతో, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమష్టిగా ముందుకు పోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఏకైక కార్పొరేషన్ అయిన మహబూబ్‌నగర్ పట్టణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వెల్లడించారు. దీంతోపాటు 20 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హామీల అమలు వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టాలని సూచించారు. ఒకప్పుడు తీవ్రంగా వెనుకబడిన నల్లగొండ జిల్లాను బీఆర్ఎస్ హయాంలో ఏ విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం ఇద్దరు మంత్రులు ఉన్న నల్లగొండ జిల్లాకు ప్రత్యేకంగా చేసిందేమీ లేదని విమర్శించారు. నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసిన తీరును పట్టణ ప్రజలకు వివరించాలన్నారు. గతంలో టీయూఎఫ్ఐడీసీ , పురపాలక శాఖ ద్వారా గతంలో అనేక వందల కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తిని మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి , పలువురు పాల్గొన్నారు.

## ఆదివాసీలపై పోలంపల్లి సర్పంచ్ అరాచకం



**కారేపల్లి, జనవరి 17 :** ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీలో ఇటీవల కాంగ్రెస్ మతుతో గెలుపొందిన సర్పంచ్ దారావత్ హేమలత, ఆమె భర్త, మిషన్ భగీరథ ఏఈ ధరావత్ బాలాజీతోపాటు మరికొంత మంది కలిసి ఆదివాసి గిరిజనులపై అరాచకాలకు పాల్పడుతున్నారని పోలంపల్లి నాగయ్య గుంపునఅబశ్రీశ్రీకు చెందిన ఆదివాసి గిరిజనులు శనివారం కారేపల్లి పోలీసులను ఆశ్రయించారు. అనంతరం స్థానిక కొమరం భీమ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసి పోరాట హక్కుల సమితి ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్తీ రాంప్రసాద్, తుడుం దెబ్బ జిల్లా నాయకుడు పూనెం శివరాములు మాట్లాడారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలంపల్లి గ్రామ పంచాయతీలో ఆదివాసి గిరిజన బిడ్డ పూనెం హిమబిందు స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ గా పోటీ చేసి ఓడిపోవడం జరిగిందన్నారు. అయితే ఆదివాసి కోయ కుటుంబానికి చెందిన హిమబిందు ఎన్నికల్లో పోటీ చేయడాన్ని జీర్ణించుకోలేక గెలుపొందిన బంజారా కులానికి చెందిన సర్పంచ్ హేమలత, అతని భర్త బాలాజీతో పాటు ఇంకొంత మంది కలిసి కోయ కులస్తుల మధ్య గొడవలు సృష్టిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇంకోసారి కోయ కులస్తులు ఎన్నికల్లో పోటీ చేస్తే చంపుతామని పరోక్షంగా బెదిరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో అమాయక ఆదివాసీ గిరిజనులను అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారన్నారు. వారి అరాచకాలకు పోలీసులు సైతం సహకరిస్తున్నఅబశ్రీశ్రీట్లు తెలిపారు. పోలీసులు కనీసం విచారణ చేపట్టకుండానే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఆదివాసీ గిరిజనులపై కాంగ్రెస్ సర్పంచ్, ఆమె భర్త, అనుచరులు చేస్తున్న అరాచకాలను అరికట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం కానునట్టు వెల్లడించారు. ఈ విషయమై ఆదివాసి జిల్లా రాష్ట్ర సంఘం నాయకులతో కూడా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెండెకట్ల యాకయ్య దొర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసీ జేఏసీ చైర్మన్ తాటి రామారావు, మండలం తుడుం దెబ్బ అధ్యక్షుడు వట్టం నాగేశ్వరరావు, ఆదివాసి జేఏసీ జిల్లా జనరల్ సెక్రటరీ ఈసాల రాంబాబు,జిల్లా నాయకులు ఎట్టి సత్యనారాయణ,జబ్బ శివరాం,కోరస సంజీవ్ పాల్గొన్నారు.

# తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన మండల విద్యాధికారి నీరజ



**చేగుంట జనవరి17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం చేగుంట మండల శాఖ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన మండల విద్యాధికారి నీరజ. మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, కృష్ణారావు,ఈ కార్యక్రమం లో తపస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణ మూర్తి, రాజేశ్వర్,చల్లా లక్ష్మణ్, మల్లారెడ్డి , తిరుపతి, దేశపతి కృష్ణమూర్తి, ప్రభాకర్ , పట్లూరి యాదగిరి, శ్రీనివాస్, చరణ్ దాస్,ప్రభాకర్ రెడ్డి,శివ కుమార్, నరసింహారెడ్డి, శ్రీనివాస్ ,బాల్ శెట్టి రేఖా, వనిత, స్వరూప రాణి,కవిత, విజయలత, రాధా, సరస్వతి, రమాదేవి,శ్రీవాణి, భవాని,శారదా, సంధ్య రాణి,మంజు లత,హిమ వర్ష, శంకర్ ,సి ఆర్ పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేగుంట పట్టణంలో టార్చ్ ర్యాలీ





**చేగుంట జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
చేగుంట మండల కేంద్రంలో శనివారం రోజున మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశానుసారం చీఫ్ మినిస్టర్ కప్ 2025లో భాగంగా ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు టార్చ్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి,ఎమ్మార్వో శివప్రసాద్,మండల విద్యాధికారి నీరజ ఏపిఎం ఏపీవో శ్వేతా,మండల పరిషత్ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, విద్యార్థులు పి ఈ టి లు గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక అందజేసిన సర్పంచ్



**చేగుంట జనవరి 17. మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలశీ కర్ణంపల్లి గ్రామంలో జనవరి 15నుండి 19వరకు జరిగే శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయము 26వ వార్షికోత్సవ మహెూత్సవము కార్యక్రమానికి రావాలని చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించిన కర్ణంపల్లి సర్పంచ్ ఆలయ కమిటీ ఛైర్మెన్ శ్రీ దుర్గ దేవి –రాములు గౌడ్, ఉప సర్పంచ్ శివ ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

# రైతు బీమా డబ్బులకు అడ్డుపడినందుకు చిన్న అత్తపై దాడి పరిస్థితి విషమం




**నారాయణపేట :** జిల్లాలోని మద్దూరు మండలం అచ్చంపల్లి గ్రామంలో ఓ మహిళపై కత్తితో ) దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపల్లికి చెందిన అంజమ్మ మంచినీటి కోసం కుళాయి వద్దకు రాగా అప్పటికే అక్కడ కాపు కాస్తున్న అంబటి లక్ష్మణ్ ) పదునైన కత్తితో ఆమె పై ఏడుసార్లు దాడి చేసినట్లు తెలిపారు.కొద్ది రోజుల క్రితం అంబటి లక్ష్మణ్ బామ్మర్ది చనిపోగా అతడి పేరు మీద రైతు బీమా డబ్బులు మంజూరయ్యాయి. తనకు అప్పులు ఉన్నాయని, అప్పులు తీర్చేందుకు రైతు బీమా డబ్బులు రూ.5 లక్షలు ఇవ్వాలని అంబటి లక్ష్మణ్ కోరగా అందుకు లక్ష్మణ్ భార్య చిన్నమ్మ(అంజమ్మ) అడ్డు పడిందన్న కోపంతో కక్ష పెంచుకుని కత్తితో దాడి చేసినట్టు తెలిపారు.ప్రస్తుతం అంజమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు అంబటి లక్ష్మణ్ పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడని మద్దూరు పోలీసులు తెలిపారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ.మున్సిపాలిటీ వార్డుల మహిళ రిజర్వేషన్ ఖరారు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు





**మెదక్ కలెక్టరేట్ జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
శనివారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో... మహిళ రిజర్వేషన్ ఖరారు ప్రక్రియ ని పారదర్శకం గా కలెక్టర్ నిర్వహించారు జిల్లా లోని మెదక్ మున్సిపాలిటీ లోని 32 వార్డు లు, నర్సాపూర్ మున్సిపాలిటీ లోని 15 వార్డు ల తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులకు రామాయంపేట మున్సిపాలిటీలో 12 వార్డులకు మహిళ రిజర్వేషన్ ఖరారు లో భాగం గా.మున్సిపాలిటీ లకు సంబందించి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ బీసీ ల డెడికేషన్ కమిషన్ ప్రకారం, ఒఎ, ర్ లది 2011 జనాభ లెక్కల ప్రకారం, మహిళ రిజర్వేషన్ ను...జీవో 9 ప్రకారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ ద్వారా కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారురాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేసారు ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ నగేష్ , ప్రత్యేక అధికారి సంధ్య,ఆర్డీవోలు , మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

# నూతన సర్పంచులు శిక్షణ కార్యక్రమాలకు తప్పక హాజరు కావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు



**మెదక్ కలెక్టరేట్ జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**



మెదక్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్యాంపస్లో సర్పంచుల అవగాహన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పాలనపై పట్టు సాధించే విధంగా ఈనెల 19 నుండి 23 వరకు ఐదు రోజులపాటు 492 మంది సర్పంచులకువిడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు. ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.నూతన సర్పంచ్లకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం పంచాయతీ అధికారాలు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, , బాధ్యతలపై, గ్రామసభలు, పంచాయతీ సమావేశాల నిర్వహణను వివరించనున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజారోగ్యంపై అవగాహన .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల వినియోగం, చేపట్టనున్న పనులు, పన్నుల వసూళ్లు, సంబంధిత 24 అంశాలపై సుదీర్ఘంగా వివరించనున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు అత్యంత అవసరం

- రోడ్డు భద్రతలో హెల్మెట్ కీలక పాత్ర
- ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

**మెదక్ జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా వ్యక్తిగత భద్రతకు ప్రధాన రక్షణ అని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల చిన్న ప్రమాదం కూడా తీవ్రమైన గాయాలు లేదా ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తోందని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రోజువారీగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విశ్లేషణలో,



ఎక్కువగా తలకు గాయాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. సరైన నాణ్యత గల ఐ.ఎస్.ఐ మార్క్ ఉన్న హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాల తీవ్రతను తగ్గించవచ్చని చెప్పారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు.ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు "ఎర్రైవే అలివేలు 2026" కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాలలు, గ్రామాలు, ప్రధాన రహదారులపై అవగాహన సదస్సులు, ఫ్లెక్సీలు, ర్యాలీల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు వివరించారు.ట్రాఫిక్ నియమాలు పాటించని, హెల్మెట్ ధరించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ చర్యలు శిక్ష కోసం కాకుండా ప్రజల ప్రాణ రక్షణ కోసమేనని స్పష్టం చేస్తూ, ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి హెల్మెట్‌ను అలవాటుగా మార్చుకొని సురక్షితంగా ప్రయాణించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి

- అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం
- యువతే ఎక్కువగా రోడ్డు ప్రమాదలకు బలవుతున్నారని ఆందోళన
- మీ కోసం కాదు మీ కుటుంబం కోసం హెల్మెట్
- అతివేగం కుటుంబాలను అనాథల్ని చేస్తుంది
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్





**మెదక్ జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
శనివారం రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో పరేడ్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి, అధికారులు మరియు సిబ్బందికి విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దృఢత్వం (ఫిజికల్ ఫిట్‌నెస్) ఎంతో అవసరమని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు."ఎర్రైవే అలివేలు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సిబ్బందిని ఉద్దేశించి జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి, నిర్ణీత వేగ పరిమితుల్లో వాహనాలు నడుపుతూ రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను ఈ సందర్భంగా తెలియజేశారు. అధిక వేగం, అజాగ్రత్త వాహన నిర్వహణ కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.రాష్ట్రంలో జరిగిన హత్యల కంటే కూడా రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి సంఖ్య ఎక్కువగా ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారిలో యువత శాతం ఎక్కువగా ఉండటం ఆందోళనకరమని పేర్కొంటూ, ప్రతి యువతకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సిబ్బంది ఇంటి నుండి బయలుదేరి క్షేమంగా తిరిగి ఇంటికి చేరే వరకు వారి కుటుంబ సభ్యులు ఎదురుచూస్తారని, అందువల్ల రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని సూచించారు.చివరగా జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సిబ్బందితో కలిసి ఈ క్రింది రోడ్డు భద్రత ప్రతిజ్ఞను పఠనం చేశారు:నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనాల చట్టంలో పొందుపరచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించనని, ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి సహకరిస్తానని దృఢసంకల్పంగా ప్రమాణం చేస్తున్నాను.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శరంగా నాయక్, సీఐలు శ్రీ జార్జ్, మహేష్, ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి

**- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**- ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ట్రాక్ సూట్ల పంపిణీ**





**పటాన్చెరు జనవరి: 17 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడ కేంద్రంగా ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీలలో..తెలంగాణ రాష్ట్ర సత్తాను చాటాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల పటాన్చెరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలికల పోటీలలో విజేతలుగా నిలిచి.. గుడివాడలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతున్న తెలంగాణ జట్టుకు శనివారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాక్ సూట్లు, షూస్, ప్రయాణపు ఖర్చులను సొంత నిధులతో అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతహాగా క్రీడాకారుడైన తాను క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో పటాన్చెరు పట్టణంలో వివిధ క్రీడల్లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన అందించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమారి, రవి, మల్లికార్జున, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు బస్టాండ్ 'బ్లాక్ స్పాట్'గా గుర్తింపు: రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన సదస్సు






**పటాన్‌చెరు, జనవరి :17 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పటాన్‌చెరు పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లాలు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై సమీక్ష నిర్వహించారు. నగరంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటైన పటాన్‌చెరు బస్‌స్టాండ్ వద్ద ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు, వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. గత ఏడాది కాలంగా ఇక్కడ అనేక చిన్న, పెద్ద ప్రమాదాలు సంభవించిన నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని లి'రోడ్ బ్లాక్ స్పాట్లలిగా అధికారులు గుర్తించారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటం, అక్రమ పార్కింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు సరైన సూచిక బోర్డులు లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని పోలీసులు విశ్లేషించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లాలు నాయక్ మాట్లాడుతూ, ప్రయాణికులు మరియు పాదచారుల రక్షణ కోసం త్వరలోనే పలు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద ప్రత్యేక బస్ బేలను ఏర్పాటు చేయడం. పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌లు నిర్మించడం. రాత్రి వేళల్లో వెలుతురు కోసం తగినన్ని వీధి దీపాలు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై నివేదిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను అరికట్టవచ్చని, ముఖ్యంగా రద్దీ సమయాల్లో (పికి కవర్స్) వాహనదారులు సంయమనం పాటించాలని పోలీసులు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, హెచ్.జి. కిషోర్ మరియు సుమారు 20 మంది స్థానిక పౌరులు పాల్గొని తమ సూచనలను అందజేశారు.

# మెదక్ 26 సం.రాల తరువాత మున్సిపల్ చైర్ పర్సన్ గా బీసీ మహిళ. 32 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు



**మెదక్ జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఎట్టకేలకు 26 సంవత్సరాల తర్వాత మెదక్ మున్సిపల్ చైర్మన్ సీటు బీసీ మహిళా కేటాయించడం 2000 సంవత్సరంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ గా కొండను సావిత్రి సురేందర్ గౌడ్ చైర్మన్ గా చేశారు తర్వాత వరుసగా జనరల్ గా రావడంతో ఎట్టకేలకు 26 సంవత్సరాల తర్వాత మెదక్ మున్సిపల్ చైర్మన్ గా బీసీ మహిళ కాబోతున్నారుమున్సిపల్ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జిల్లాలోని మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాల్టీల రిజర్వేషన్లు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఖరారు చేశారు. అన్ని రాజకీయ పార్టీల నేతల సమక్షంలో మహిళా వార్డు స్థానాలను డ్రా విధానంలో ఎంపిక చేశారు. మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానం బీసీ మహిళలు కేటాయించారు. 4 మున్సిపాలిటీల్లో వేడెక్కిన రాజకీయం. మెదక్ మున్సిపల్ 32 వార్డుల రిజర్వేషన్ వివరాలు. 1. ఎస్సీ మహిళా 2. ఎస్టీ జనరల్, 3. జనరల్ మహిళ, 4. జనరల్ మహిళ, 5. జనరల్, 6. జనరల్, 7. బీసీ మహిళ, 8. బీసీ మహిళ, 9. జనరల్, 10. జనరల్ మహిళ, 11. బీసీ మహిళ, 12. బీసీ మహిళ, 13. ఎస్సి మహిళా, 14. మహిళ జనరల్, 15. బీసీ జనరల్, 16. బీసీ జనరల్, 17. జనరల్ మహిళ, 18. ఎస్సీ జనరల్, 19. జనరల్, 20. బీసీ జనరల్, 21. బీసీ మహిళ, 22. జనరల్, 23. జనరల్ మహిళ, 24. బీసీ జనరల్, 25. బీసీ జనరల్, 26. ఎస్సీ జనరల్, 27. జనరల్ మహిళ, 28. జనరల్ మహిళ, 29. బీసీ జనరల్, 30. జనరల్, 31. జనరల్, 32. ఇలా జనరల్ మహిళలకు కేటాయిస్తూ ప్రకటన చేశారు."

# తలసాని పిలుపు మేరకు పోరాటాన్ని ఆపేదే లేదు



**సికింద్రాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నల్ల జెండాలు చేతబూని, మెడలో నల్ల కండువాలు వేసుకొని మోండా మార్కెట్ నుండి బాటా, జనరల్ బజార్ మీదుగా ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు చేరుకొని అక్కడ కొద్దిసేపు బైఠాయించారు. అక్కడ కు చేరుకున్న పోలీసులు మీ ర్యాలీకి అనుమతి లేదంటూ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్‌తోపాటు మిగిలిన వారిని అరెస్ట్ చేసి రాంగోపాల్ పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలని రెండు సంవత్సరాల నుండి పోరాడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఒకటి, 4 నియోజకవర్గాలకు కూడా జిల్లాలు ఉన్నాయని, ఈ విషయాన్ని ఇటీవల అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించారని గుర్తు చేశారు. అలాంటిది 14 నియోజకవర్గాలకు హైదరాబాద్ ఒక్కటే జిల్లా ఉన్నందున సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలతో లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఈ ప్రాంతం నుండి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఈ ప్రాంతానికే చెందిన ప్రస్తుత హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయలకు విజ్ఞాపనలను అందజేసినట్లు వివరించారు. అస్థిత్వాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం కుట్రలు..కాగా ఇటీవల జీహెచ్ఎంసీని డీ లిమిటేషన్‌లో భాగంగా ప్రభుత్వం ఓఆర్ఆర్ వరకు విస్తరించి 300 డివిజన్లకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 300 డివిజన్లను మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. మూడు కార్పొరేషన్లలో 220 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరు, ఈ ప్రాంత అస్థిత్వాన్ని దెబ్బ తీసే విధంగా ప్రభుత్వం కుట్రలు చేస్తుందని చెప్పారు. +నవీజ ఏర్పాటుకు ముందు సికింద్రాబాద్ ప్రత్యేక మున్సిపాలిటీగా ఉన్నదని ఆయన గుర్తు చేశారు. సికింద్రాబాద్ పేరుతోనే మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కు ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని వివరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు అందరికీ తమ ఉద్యమానికి మద్దతు తెలపాలని ఇటీవల లేఖలు కూడా పంపినట్లు వివరించారు. ఈ ఉద్యమం రోజు రోజుకు మరింత ఉధృతం అవుతుందని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఏమి చేయలేదన్నారు..ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్‌ను తాము ఏమి చేయలేదని చెప్పారని, ముఖ్యమంత్రి చెప్పింది పూర్తిగా అసత్యం అని అన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని పోలీసు సర్కిల్స్, +నవీజలోని కొన్ని డివిజన్లను మల్కాజిగిరి పరిధిలోని జోన్లలో చేర్చారని, ఇప్పటికే కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంత చరిత్ర, అస్తిత్వం రక్షించబడాలంటే సికింద్రాబాద్ కార్పోరేషన్ ఏర్పాటుతోనే సాధ్యం అన్నారు. దీనికోసం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి శాంతి ర్యాలీకి పిలుపునిచ్చారని చెప్పారు. ర్యాలీకి పోలీసు శాఖ అనుమతి కోసం ఈ నెల 5 వ తేదీన హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ లో దరఖాస్తు చేస్తే మా పరిధిలో కాదంటూ మల్కాజిగిరి కమిషనరేట్‌కు తమ దరఖాస్తు పంపారని, అక్కడ మా పరిధి కాదంటూ సికింద్రాబాద్ ఐజూకి ఇలా అధికారులే కన్ఫ్యూజన్‌కు గురయ్యారని వివరించారు. శుక్రవారం రోజు కూడా తాము ర్యాలీ న్వీహించే ప్రాంతాలను పోలీసు అధికారులు పరిశీలించారని చెప్పారు. కాగా శుక్రవారం రాత్రి తమ ర్యాలీకి అనుమతి నిరాకరిస్తూ వాట్సాఫ్ ద్వారా సమాచారం ఇచ్చారని తెలిపారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని, అవసరమైతే

# గ్రామీణ విద్యార్థులకు సువర్ణావకాశం






**పాపన్నపేట జనవరి 17 మెదక్ టుడే, న్యూస్ :-**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సీఎం కప్ క్రీడలు గ్రామీణ విద్యార్థులకు సువర్ణావకాశమని పాపన్నపేట ఎంపీడీఓ విష్ణువర్ధన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం పాపన్నపేటలో పాఠశాల ఉపాధ్యాయు లు,విద్యార్థులతో కలిసి టార్చ్ ర్యాలీ నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈ పోటీల ద్వారా విద్యార్థుల లోని క్రీడా ప్రతిభను గుర్తించే అవకాశముందని,గ్రామాల లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యా యులు ప్రభాకర్,రాజేందర్,నాగరాజు, రమేష్, రేణుక, కృష్ణకాంత్,మంగ నర్సింలు,అంజాగౌడ్ తదితరులు ఉన్నారు.

# మాఘ అమావాస్య సందర్భంగా జిల్లా ఎస్పీ పర్యవేక్షణ లో ఏడుపాయల జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

**- బ్రీఫింగ్‌లో సిబ్బందికి కీలక సూచనలు చేసిన జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**







**మెదక్ జిల్లా పాపన్నపేట మండలం జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతి నిధి**మాఘ అమావాస్య సందర్భంగా ఏడుపాయల వనదుర్గమ్మ వద్ద స్నానలను ఆచరించే భక్తుల దృశ్య మెదక్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా జాతర బందోబస్తు ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో మాఘ అమావాస్య విధుల నిర్వహణపై నిర్వహించిన బ్రీఫింగ్‌లో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ గారు సిబ్బందికి కీలక సూచనలు చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించాలని, క్యూ లైన్లు, బారికేడ్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతర నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులపై సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి జాతర మొత్తం నిరంతర నిఘాలో ఉంచినట్లు వివరించారు. భక్తులు పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపి సహకరించాలని కోరారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్, మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, దొంగతనాలు, గొడవలు వంటి అవాంఛనీయ ఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర బందోబస్తును మూడు సెక్టార్లుగా విభజించి, జిల్లా ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో సుమారు 250 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని, లోతట్టు ప్రాంతాలు లేదా ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే డయల్ 100 లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. భక్తులు పోలీసు సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం పూర్తి చేసుకొని సురక్షితంగా తిరిగి వెళ్లాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, జర్జ్‌ఎసై సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ టుడే
MEDAK TODAY
ఆదివారం, 18 జనవరి 2026

## సర్పంచ్ ఎన్నికలే మన పార్టీ బలానికి నిదర్శనం





**భీంగల్, జనవరి 17:** భీంగల్ ఎల్‌జే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భీంగల్ పట్టణ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలే మన పార్టీ బలానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో 40 పైగా సర్పంచులను, ఏడు మండల కేంద్రాల్లో ఐదు మండల కేంద్రాల సర్పంచ్లను మనమే గెలిపించుకున్నామని, గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీలో ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్‌ఎస్ పార్టీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అధికారంలోకి రాకముందు భీంగల్ పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారిందో ప్రజలందరికీ తెలుసన్నారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం రాకముందు భీంగల్ మురికి కాలువలు, చెడిపోయిన రోడ్లు, అపరిశుభ్రతతో ఉండేదని, తాను పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో భీంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. భీంగల్‌లో ఇంటింటికి నల్లానీరు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలోనే భీంగల్‌ను మున్సిపాలిటీగా మార్చగలిగామని, మున్సిపాలిటీగా ఏర్పడిన వెంటనే కేటీఆర్ ద్వారా రూ.35 కోట్ల నిధులు రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి మంజూరు చేయించామని తెలిపారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా సెంట్రల్ లైటింగ్, డివైడర్ల కోసం మరో రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు నిధులు తీసుకురాగలిగామని చెప్పారు. ప్రతి వెయ్యి ఓట్లు ఉన్న వార్డుకు సుమారు రూ.6 కోట్ల వరకు నిధులు కేటాయించేలా అభివృద్ధి చేశామని వివరించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా భీంగల్‌లో ఇంటింటికి నల్లనీరు అందించామని, రూ.35 కోట్లతో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రైతుల కోసం చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ అభివృద్ధి కారణంగానే భీంగల్ మున్సిపాలిటీలో ఓటు అడిగే హక్కు మనకే ఉందన్నారు. సగంలోనే వెజ్--నాన్ వెజ్ మార్కెట్ పనులు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మనం మంజూరు చేసిన నిధులతో పనులు కూడా పూర్తి చేయడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయకుండా, కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అలాగే రూ.3 కోట్లతో చేపట్టిన వెజ్--నాన్ వెజ్ మార్కెట్ పనులను సగంలోనే నిలిపివేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటింటికి తిరిగి గ్యారంటీ కార్డులు కాంగ్రెస్ నాయకులతో పంచించారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్యారంటీలను పూర్తిగా అటకెక్కించారని విమర్శించారు. అందుకే బీఆర్‌ఎస్ పార్టీ 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను రూపొందించిందని, ఈ కార్డుల ద్వారా గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఎంత బాకీ పడిందో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రూ.2500 చేయూత పెన్షన్, రూ.4000 ఆసరా పెన్షన్ పెంపు, తులం బంగారం, విద్యా భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాలు, 4000 నిరుద్యోగ భృతి, రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా రూ.15,000, ప్రతి పంటకు రూ.500 బోనస్ వంటి అనేక హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి ఇంటికి వచ్చినప్పుడు ఈ బాకీ కార్డును చూపించి, హామీలు నెరవేర్చితేనే ఓటు వేస్తామని, లేకపోతే ఓడిస్తామని ప్రజలు స్పష్టంగా చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీలో టికెట్లు ఆశించే వారు ఎంతమంది ఉన్నా, ఎవరికి టికెట్ వచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రజలు ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని వేముల ప్రశాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొంకంటి నర్సయ్య, ఎక్స్ జెడ్పిటిసి రవి, ఎక్స్ ఎంపిపి మహేష్, గ్రాజూ చైర్మన్ శివసారి నర్సయ్య, జిల్లా కో అప్షన్ మొయిజ్, పసుల ముత్తేన్న, శర్మ నాయక్, మాణిక్యాల శ్రీనివాస్, తుక్కజీ నాయక్ పాల్గొన్నారు.

## యాదాద్రి ఈఓగా భవానీ శంకర్.. విజిలెన్స్ డీఐజీగా అభిషేక్ మహంతి..!



**యాదాద్రి :** తెలంగాణలో మరోసారి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. నలుగురు ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం కల్పిస్తూ శనివారం చీఫ్ సెక్రటరీ కే.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరి గుట్ట ఈవోగా భవనీ శంకర్ నియమితులయ్యారు. ఇదివరకూ ఆయన గవర్నర్‌కు సంయుక్త కార్యదర్శిగా సేవలందించారు. ప్రభుత్వ, ఆర్థిక శాఖ ప్రత్యేక సెక్రటరీ కే.హరిత (2013 బ్యాచ్) కుమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ జాయింట్ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.నిఖిల(2015 బ్యాచ్) మత్స్య శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ సీఈఓగా వెంకటేశ్ ధోత్రే బదిలీ అయ్యారు. ఐపీఎస్‌ల బదిలీల విషయానికొస్తే.. సైబరాబాద్ పోలీస్, ట్రాఫిక్ సంయుక్త కమిషనర్‌గా సేవలందిస్తున్న గజరావు భూపాల్(2008 బ్యాచ్) ప్రొవిజనింగ్, లాజిస్టిక్స్ ఐజీగా నియమితులయ్యారు. నార్కోటిక్స్ బ్యూరో ఐజీగా పనిచేస్తున్న అభిషేక్ మహంతి(2011 బ్యాచ్) విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా బదిలీ అయ్యారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీగా శివం ఉపాధ్యాయ(2021 బ్యాచ్) వెళ్లనున్నారు.

# స్వచ్ఛభారత్ యాత్ర కార్యక్రమంలో భాగంగా క్లీనప్ డ్రైవ్ పై కలెక్టరేట్ లోని అధికారులకు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనైనదని డిఆర్డిఓ శ్రీనివాసరావు అన్నారు.

**- క్లీనప్ డ్రైవ్ పై కలెక్టరేట్ లోని అధికారులకు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనైనదని డిఆర్డిఓ శ్రీనివాసరావు అన్నారు.**








**మెదక్ కలెక్టరేట్ జనవరి 17 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విజయవంతంగా నడుస్తున్న స్వచ్ఛ్ భారత్ యాత్ర వాహనం 07 రోజులో భాగంగా మెదక్ కలెక్టరేట్ కు చేరుకోవడం జరిగింది, ప్లాస్టిక్ ను సేకరించి వాటిని మిషనరీ లో వేయడం , తడి చెత్త పొడి చెత్త సేకరణ వాడిని డిస్పోస్ చేయడం వల్ల వచ్చే వేస్ట్ తోటి వస్తువుల తయారీ.జిల్లా అధికారులతో పాటు, గ్రామపంచాయతీ సెక్రటరీలకు క్లీనప్ డ్రైవ్ పై అవగాహన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు పాల్గొని ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విజయవంతంగా నడుస్తున్న స్వచ్ భారత్ యాత్ర ప్లాస్ట్ ఇండియా, ప్రపంచంలోకెల్లా ప్లాస్టిక్ ఎగ్జిబిషన్ కు సంబంధించి వాహనం ద్వారా ప్రతి జిల్లాకు స్వచ్ఛభారత్ సిబ్బంది 41 కిలోమీటర్ల ప్రతిరోజు కాలినడకన వెళ్తూ ప్లాస్టిక్ కలెక్ట్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ఏడవ రోజులో భాగంగా మెదక్ జిల్లా కలెక్టరేట్ కు చేరుకోవడం జరిగిందన్నారు. క్లీనప్ డ్రైవ్ పై అవగాహన కల్పించారన్నారు. క్లీనప్ డ్రైవ్ అంటే సమాజంలోని ప్రజలు, స్వచ్ఛంద సేవకులు కలిసికట్టుగా తమ పరిసరాలను, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసే కార్యక్రమం; ఇది చెత్తను తొలగించి పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా, పారిశుధ్యం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, స్థానిక ప్రజలలో పర్యావరణ స్పృహను పెంచుతుందని . ఈ డ్రైవ్‌లు సాధారణంగా చెత్త ఏరివేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం, మొక్కలు నాటడం వంటి కార్యకలాపాలను కలిగి ఉంటాయి, దీనివల్ల సమాజంలో పరిశుభ్రత పెరుగుతుందన్నారు. క్లీనప్ డ్రైవ్ యొక్క ముఖ్య ఉద్దేశం చెత్తను తొలగించి, పర్యావరణాన్ని ఆరోగ్యకరంగా ఉంచడమే అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు

# జిన్నారంలో బీఆర్ఎస్ సమన్వయ సమావేశం: మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా కార్యచరణ

**- గడ్డపోతారంలో 'బాకీ కార్డు'ల కలకలం: కాంగ్రెస్ ప్రభుత్వానికి చురకలు అంటించిన ఆదర్శ్ రెడ్డి.**







**జిన్నారం జనవరి : 17(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
రానున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ తన జోరును పెంచింది. శనివారం జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ సమన్వయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్-ఛార్జ్ ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మున్సిపాలిటీ ఇన్-ఛార్జ్ సాయి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మరియు ఇతర నేతలు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండాను రెపరెపలాడించేందుకు ప్రతి కార్యకర్త సమరోత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కన పెట్టి ఐక్యంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కదలాలని దిశా నిర్దేశం చేశారు. అంతకుముందు గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో బీఆర్‌ఎస్ శ్రేణులు వినూత్న ప్రచారం చేపట్టాయి. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో ఆ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ ప్రజలకు 'బాకీ కార్డుల'ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోంది. అందుకే ఆ పార్టీ ప్రజలకు ఇవ్వాల్సిన బాకీని గుర్తు చేస్తూ ఈ కార్డులను పంపిణీ చేస్తున్నాం. ప్రతి వార్డులో, ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి" అని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మండల అధ్యక్షులు రాజేష్, స్థానిక ఇన్-ఛార్జులు శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి మాణిక్ యాదవ్, జగన్నాథ్ రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాఘ అమావాస్య కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు














**పాపన్నపేట, జనవరి 17 మెదక్ టుడే న్యూస్:**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. ఆదివారం మాఘ అమావాస్య పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో దేవాదాయ శాఖ,పోలీస్,వైద్య,పంచాయతీ రాజ్,విద్యుత్ శాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. శనివారం మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఏడుపాయల గోకుల్ ఫంక్షన్ హల్ లో సిబ్బంది కీ తగు సూచనలు చేశారు. జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ హెల్త్ క్యాంపు లో మాత్రలను పరిశీలించి సిబ్బందికీ తగు సూచనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. స్నాన జల్లులు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..